క్లుప్తంగా

డీఐఓ తనిఖీ

నేలకొండపల్లి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ చందు నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో సేవలపై ఆరా తీసిన ఆయన వ్యాక్సినేషన్ రికార్డులు తనిఖీ చేశారు. వైద్యాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీజీటీగా పనిచేస్తూనే డీఎస్సీలో ఎంపిక


సుధాకర్

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువుకు చెందిన కాంపాటి సుధాకర్ ఒకే ఏడాది రెండు టీచర్ పోస్టులు సాధించాడు. గ్రామానికి చెందిన కాంపాటి కృష్ణయ్య – యశోద చిన్న కుమారుడు సుధాకర్ మహబూబాబాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిన్నాడు. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లోనూ ఆయన ఓపెన్ కేటగిరీలో జిల్లా స్థాయి 12వ ర్యాంకు సాధించారు. ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసిన సుధాకర్‌ను గ్రామస్తులు అభినందించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

నేలకొండపల్లి: బీజేపీ సభ్యత్వం తీసుకుని మద్దతుగా నిలవాలని జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ ఎడ్ల అశోక్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రతీ బూత్‌లో సభ్యత్వాలు చేయించి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకావాలని నాయకులకు సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ బి తావుర్యా తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సహకారనగర్, గట్టయ్యసెంటర్, వీడీవోస్ కాలనీ, కృషి భవన్ రోడ్, శ్రీకృష్ణ నగర్, బోడేపూడిస్థూపం ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

విద్యార్థిని ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని అమూల్య రోలర్ స్కేటింగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఆమె పోటీలకు వెళ్లేందుకు మంగళవారం రూ.వెయ్యి నగదు అందజేశారు.

'న్యూవిజన్' విద్యార్థి..

ఖమ్మం సహకారనగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యాన సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అండర్–14 వాలీబాల్ పోటీల్లో తమ విద్యార్థి ఎం.సాయి అక్షరకుమార్ ప్రతిభ కనబర్చాడని న్యూవిజన్ పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్ తెలిపారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ అబాద్ అలీ అభినందించారు.

ఉపాధ్యాయుల పాదయాత్ర

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ మంగళవారం ఉపాధ్యాయులు పాదయాత్ర చేపట్టారు. సూర్యాపేట జిల్లాలోని కోదాడ నుంచి మండలంలోని రాయగూడెం పాఠశాల వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు మాట్లాడగా బి.సత్యనారాయణ, రాజు, నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు సుంతర మోని నాగార్జున, పురుషోత్తంరావు, నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి

రఘునాథపాలెం: భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం(ఇఫ్టూ) జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న అన్నారు. మండలంలోని కోయచలకలో పసుపులేటి నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు శ్రీను, రాములు, నాగేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్‌కు మంత్రి పరామర్శ



ఖమ్మం వన్‌టౌన్: రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందగా ఆయనను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో ఉత్తమ్ దంపతులను పరామర్శించి మాట్లాడారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

కూసుమంచి: మండలంలోని జక్కేపల్లి ఎస్సీ కాలనీ వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. ఖమ్మం నుండి జక్కేపల్లికి వచ్చే బస్సు కాలనీలోకి వెళ్లి ఖమ్మం బయలుదేరుతుంది. ఈక్రమాన కాలనీలోకి వచ్చాక డ్రైవర్ వెనక్కి తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి వెనుక భాగం దూసుకెళ్లింది. ఈ సమయాన ప్రయాణికులు లేకపోవటంతో ప్రమాదం తప్పింది. అనంతరం గ్రామస్తుల సహకారంతో బస్సును బయటకు తీసి బయలుదేరారు.

మెప్మాలో ఆర్పీల పెత్తనం..

- మహిళల అమాయకత్వమే ఆసరా
- రుణాల పేరుతో దండుకుంటున్న పలువురు
- బ్యాంకుల్లో జమ చేయాల్సిన నగదు వాడుకుంటున్న ఇంకొందరు
- అక్రమాలు బయటపడడంతో 33వ డివిజన్ ఆర్పీ తొలగింపు


డ్వాక్రా సమావేశంలో పాల్గొన్న సభ్యులు(ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థికాభివృద్ధికి సెర్ప్ ఆధ్వర్యాన, పట్టణ ప్రాంతాల్లోనైతే మెప్మా ద్వారా మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి రుణాలను మంజూరు చేయిస్తారు. ఆపై మహిళల స్వయం ఉపాధి కోసం వ్యాపారాల నిర్వహణకు సూచనలు ఇవ్వాల్సిన మెప్మా పరిధిలోని ఆర్పీలు కొందరు అక్రమలకు పాల్పడుతున్నారు. వీరికి ప్రభుత్వం రూ.6 వేల గౌరవ వేతనం ఇస్తోంది. కానీ కొందరు సంఘాల్లో సభ్యుల అమాయకత్వం, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని రుణాల పేరిట కమీషన్లు తీసుకోవడం, సభ్యులు చెల్లించిన రుణ వాయిదాలను బ్యాంకుల్లో జమ చేయకుండా సొంతానికి వాడుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మోసపోయామని తెలిశాక అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు.

అధికారులతో సంబంధం లేకుండానే?

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మహిళా సంఘాల నిర్వహణ బాధ్యత మెప్మాపై ఉంటుంది. మెప్మాకు ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు డీఎంసీ ఆ తర్వాత టీఎంసీ, సీఓ, ఆర్పీ ఇలా పలు పోస్టులు ఉంటాయి. మహిళా సంఘాల నుండే ఒకరిని సమాఖ్యకు ఆర్పీగా ఎన్నుకుంటారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో 4,354 సంఘాలకు 42,918 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఈమేరకు 162 మంది ఆర్పీలుగా పని చేస్తుండగా, ఒక్కొక్కరి పరిధిలో 15 నుండి 30 సంఘాల వరకు ఉంటాయి. అయితే, అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఆర్పీలు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లు సాగుతోంది. అధికారులతో సంబంధం లేకుండానే మహిళా సంఘాలను ఏర్పాటు చేయడం, బ్యాంకులకు తీసుకెళ్లి రుణాలను ఇప్పించడం.. ఇందుకోసం కమీషన్లను వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

బ్యాంకర్లతో సమావేశం..

ఆర్పీల అక్రమాలు వెలుగు చూస్తున్న తరుణాన మెప్మా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బ్యాంకుల ద్వారా మహిళా సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేసే అంశంపై దిద్దుబాటు చర్యలు చేపట్టనున్నారు. మెప్మా సీఓ, టీఎంసీ, డీఎంసీ స్థాయి అధికారులకు తెలియకుండా, వారి సంతకాలు చూడకుండానే ఆర్పీలు చెప్పారని కొందరు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తేలింది. దీంతో తమకు సమాచారం లేకుండా రుణాలు మంజూరు చేయొద్దని సూచనలు ఇచ్చేందుకు మెప్మా అధికారులు బ్యాంకర్లతో శనివారం సమావేశం ఏర్పాటుచేశారు. ఏ సంఘానికి రుణం మంజూరు చేయాలన్నా పత్రాలన్నీ పక్కాగా ఉన్నాయా అని చూడడమే కాక సభ్యులంతా హాజరైతే ఇవ్వాలని సూచనలు చేయనున్నారు.

33వ డివిజన్‌లో అక్రమాలు

ఖమ్మం 33వ డివిజన్‌కు చెందిన ఆర్పీ ఇలానే మహిళలను మోసం చేసినట్లు ఇటీవల బయటపడింది. మనుగడలో లేని సంఘాల్లో సభ్యులను చేర్పించి రుణాలు ఇప్పిస్తామని నమ్మించిన ఆర్పీ వహీదా బ్యాంకులో ఖాతాలు తెరిపించింది. అయితే, రూ.10వేల చొప్పున రుణాలు వస్తాయని చెప్పగా.. ఖాతాల్లో రూ.20లక్షల మేర జమ కావడంతో అనుమానం వచ్చి ఆరా తీస్తే ఆర్పీ అక్రమాలకు వెలుగుచూశాయి. ఈ నేపథ్యాన అధికారులు స్పందించి వహీదాను బాధ్యతల నుంచి తొలగించారు. అంతేకాక మహిళలను మోసం చేస్తూ బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరిలో, చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడుతున్న ఆర్పీలపై ఆరా తీస్తున్నారు. ఈవిషయమై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మెప్మా విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

కామేపల్లి: ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ సైదులు అన్నారు. కామేపల్లి పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నెల్లూరి చందన, సీహెచ్ఓ సుధారాణి, హెచ్ఈఓ వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి

నేలకొండపల్లి: ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలు, విమర్శలను తిప్పికొట్టాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. మంగళవారం మండలంలోని అమ్మగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు అడపాల రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యచరణ రూపొందించాలన్నారు. అనంతరం చైర్మన్‌ను స్థానికులు సన్మానించారు. మండల నాయకులు వజ్జా శ్రీనివాసరావు, హనుమంతరావు, నరేష్, రామారావు, వేణు, కోటయ్య, కృష్ణారావు, రామారావు, నర్సయ్య, లక్ష్మినర్సు పాల్గొన్నారు.

పెరుగుతున్న శ్రమ దోపిడీ

ఖమ్మంమయూరిసెంటర్: కార్మిక వ్యతిరేక విధానాలు, మారిన కార్మిక చట్టాల నేపథ్యాన శ్రమ దోపిడీ పెరుగుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ తెలిపారు. పాలక వర్గాలు కార్పొరేట్ శక్తుల తొత్తుగా మారాయని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగై మోదీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని తెలిపారు. ఏఐటీయూసీ శిక్షణా తరగతులు మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ప్రారంభం కాగా తొలుత ఏఐటీయూసీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు రావిశివరామకృష్ణ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతుల్లో ఏఐటీయూసీ చరిత్ర, కార్మిక చట్టాలు అనే అంశంపై యూసుఫ్ బోధించారు. కార్మిక సంఘాలు, యాజమాన్యాలు, పాలకులు అనే అంశాన్ని ఏనుగు వెంకటేశ్వరరావు బోధించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, రాష్ట్ర నాయకులు బీజీ క్లైమెంట్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, జిల్లా నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, వీరునాయక్, రాంబాబు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు ఆదర్శంగా నిలవాలి

కూసుమంచి: కమ్యూనిస్ట్ పార్టీలో ఉన్న ప్రతీ కార్యకర్త ఆదర్శంగా నిలవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మల్లేపల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్ట్ కార్యకర్తలు ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని,పార్టీ కోసం, బడుగుల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం పార్టీ గ్రామ కార్యదర్శిగా చీర్ల రాధాకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బుగ్గవీటి సరళ, మండల కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి, సభ్యులు తోటకూరి రాజు, శీలం గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలో ఈ నెల 3వ తేదీన నిర్వహించే బహుజన బతుకమ్మ పోస్టర్లను పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక ఆధ్వర్యాన ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీర నారీ సావిత్రీబాయి పూలే జిల్లా అధ్యక్షురాలు పీఆర్ దేవి మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా విమలక్క ఆధ్వర్యాన నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆడబిడ్డలందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. లక్ష్మి, మనీ, నాగలక్ష్మి, సత్యవతి, లక్ష్మణ్, నాగేశ్వరరావు, వెంకన్నగౌడ్, వెంకయ్య, సురేష్, రహీం, తిరుమల్‌రావు, సుగుణరావు, రాంబాబు పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై దాడి

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామానికి చెందిన స్పందన (18) అనే దివ్యాంగురాలి పిన్నికి గ్రామానికి చెందిన మరో మహిళకు మంగళవారం చాకిరేవు బండ వద్ద గొడవ జరిగింది. దీంతో ఓ మాజీ ప్రజాప్రతినిధికి ఇంటి వద్ద పంచాయతీ పెట్టగా.. ఇద్దరు మహిళలు గొడవ పడుతుంటే పిన్ని కోసం వెళ్లిన దివ్యాంగురాలిపై మరో మహిళకు చెందిన భర్త అకారణంగా దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలితో పాటు చెల్లి శిరీష స్థానిక పోలీసులను ఆశ్రయించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కూసుమంచి: మండలంలోని పాలేరులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో గైగోళ్లపల్లికి చెందిన బాణోత్ శ్రీను (40) మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మృతుడు శ్రీను పాలేరుకు వెళ్లి నడిచి వస్తుండగా సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన మృతి చెందడంతో శ్రీను భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మున్నేరు బ్రిడ్జి పైనుంచి దూకిన వ్యక్తి


ఉమేష్‌ను తీసుకొస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని మున్నేరులో దూకిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి రాజీవ్ గృహకల్ప ప్రాంతానికి చెందిన పారుపల్లు ఉమేష్ వ్యక్తిగత కారణాలతో మంగళవారం ఖమ్మం బైపాస్‌లోని కరుణగిరి బ్రిడ్జి పైనుంచి మున్నేటిలో దూకాడు. దీంతో ఆయన కాలికి గాయం కాగా ఇబ్బంది పడుతూనే ఒడ్డుకు చేరుకున్నాడు. అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ ఏఎస్ఐ అక్కులు, సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించి ఆయనను భుజాలపై ఎత్తుకుని పైకి తీసుకొచ్చి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గడువు దాటిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

- కొత్తవి ఇస్తామన్న అధికారులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంఅర్బన్ తహసీల్ పరిధిలో ఇటీవల పలువురికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఇందులో కొన్ని గడువు దాటినవి ఉన్నాయి. ఈ విషయం తెలియక లబ్ధిదారులకు బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లగా బ్యాంకర్లు గడువు దాటిందని చెప్పడంతో తహసీల్‌లో చేరుకుని అధికారులను సంప్రదించారు. మొత్తం 12మందికి ఇచ్చిన చెక్కులకు ఈ పరిస్థితి ఎదురైందని సమాచారం. ఈ విషయంపై తహసీల్దార్ స్వామిని వివరణ కోరగా వరుస కార్యక్రమాలు, వరద సహాయక చర్యల్లో పాల్గొనడంతో చెక్కుల పంపిణీలో జాప్యం జరిగిందని, గడువు దాటిన చెక్కులు తీసుకుని కొత్తవి ఇచ్చేందుకు లబ్ధిదారులకు సమాచారం ఇస్తున్నామని తెలిపారు.

పారదర్శకంగా ఇంటింటి సర్వే

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల కోసం జరుగుతున్న ఇంటింటి సర్వే పంచాయతీ కార్యదర్శుల ద్వారానే జరుగుతుందని తహసీల్దార్ జె.మానిక్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సర్వేలో ప్రధానంగా గుడిసెలు, అద్దె నివాసం, రేకులషెడ్డు, తడికెలు, దెబ్బతిన్న ఇళ్లలో ఉండే వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కాగా, సర్వేలో డీలర్ల వద్ద నుంచి ఆధార్‌కార్డు, రేషన్ కార్డుల వివరాలు మాత్రమే తీసుకుంటున్నామని, వారి పాత్ర ఏమీ లేదన్నారు.

విద్యాలయాల్లో 'స్వచ్ఛతా హీ సేవ..'


తిరుమలాయపాలెం: పిండిప్రోలు కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్/ తిరుమలాయపాలెం/ ఖమ్మంరాపర్తినగర్: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని నగరంలోని హార్వెస్ట్ విద్యాసంస్థల్లో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. అలాగే కోవెల శ్రీ వెల్ఫేర్ యూత్, ఖమ్మం నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యాన తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, వలంటీర్లు గ్రామంలోని గ్రామపంచాయతీ ప్రాంగణం, హై స్కూల్, కళాశాల ప్రాంగణాలను శుభ్రం చేశాక స్వచ్ఛత సేవ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మై భారత్ లోగో కలిగిన నోట్ బుక్, పెన్, క్యాప్ ఇచ్చి పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కమర్తపు భానుచందర్, యూత్ క్లబ్ సెక్రటరీ కాశిన కిషోర్‌కుమార్, గ్రామ సెక్రెటరీ టి.రాము, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. అంతేకాక ఖమ్మం నగరంలోని కవిత మెమోరియల్ కళాశాలలో నెహ్రూ యువక కేంద్రం కేసీఆర్‌నగర్‌కు చెందిన యూత్‌క్లబ్ ఆధ్వర్యాన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పెన్, నోట్ బుక్స్, టోపీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే అధికారి భానుచందర్, ప్రిన్సిపాల్ రమణరావు, వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, అధ్యాపకులు, ఎన్‌సీసీ కేడెట్లు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై నమ్మకం కల్గించాలి


స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ

కూసుమంచి: పోలీసులు సమర్థవంతంగా విధులను నిర్వహిస్తూ పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్గించాలని డీసీపీ (లా అండ్ ఆర్డర్) ప్రసాదరావు అన్నారు. మంగళవారం కూసుమంచి పోలీస్‌స్టేషన్‌తో పాటు సీఐ కార్యాలయాన్ని ఆయన సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అలాగే పోలీస్ స్టేషన్ నిర్వహణ, నేరాల నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నాక మాట్లాడారు. స్టేషన్ పరిసరాలను ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని, సిబ్బందికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పాత నేరస్తుల నివాసాలపై కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారంటూ అడిగి తెలుసుకున్న డీసీపీ శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా అవగాహన, చైతన్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సంజీవ్, ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

'డెంగీ కేసులు తగ్గుతున్నాయి'


మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: డెంగీ వ్యాధి నిర్మూలన కోసం కేఎంసీ చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, సెప్టెంబర్ 23 నుంచి ఇప్పటి వరకు ఒక్క డెంగీ కేసు కూడా నమోదు కాలేదని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైడే, పరిసరాల పరిశుభ్రత, డ్రెయినేజీల్లో కెమోపాస్ స్ప్రే వంటి కార్యక్రమాలతో అడ్డుకున్నట్లు చెప్పారు. ప్రజలు కేఎంసీకి ఇలానే సహకరించి డ్రైడేను పక్కాగా నిర్వహించాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్, శానిటరీ సిబ్బంది, ఇతర వర్కర్లు అంతా సమష్టిగా పని చేసి డెంగీ నివారణకు కృషి చేస్తున్నారన్నారు. అలాగే కుటుంబ సర్వే నిమిత్తం మంగళవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. రేపు(గురువారం) ప్రతీ కుటుంబానికి ఒక ఫ్యామిలీ ఐడీ ఇవ్వడం కోసం 54వ డివిజన్‌లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే అక్టోబర్ 2నగాంధీ జయంతి సందర్భంగా నగరంలో ఎవరైనా చికెన్, మటన్, ఫిష్, ఇతర మాంసం దుకాణాలు, మద్యం దుకాణాలు తెరిచి విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

4వ డివిజన్‌లో పర్యటన..

ఖమ్మంఅర్బన్: శానిటేషన్ ఇంజినీరింగ్ విజిట్‌లో భాగంగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం 4వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల పనితీరు, చెత్త సేకరణ వివరాలను శానిటరీ సూపర్‌వైజర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఖాళీ ప్లాట్లలో నీరు ఆగితే యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. డివిజన్ కార్పొరేటర్ డ్రెయినేజీ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకురావడంతో చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్‌ను ఆదేశించారు.

విద్యారంగానికి పెద్దపీట

ఖమ్మంరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని యువజన కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా సురేష్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని అందులో భాగంగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన రెండు నెలల్లోనే ఫలితాలు ప్రకటించి ఉపాధ్యాయ కొలువులకు ఎంపిక చేసిందన్నారు. అలాగే త్వరలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజారంజక పాలనకు నిదర్శనమని తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం అర్బన్: మూడు రోజులుగా సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న జిల్లా స్థాయి పాఠశాలల ఆటల పోటీలలో తమ పాఠశాల చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని మల్లెమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం.కృష్ణవేణి, పీడీ కృష్ణయ్యలు తెలిపారు. రేణుక, షేక్.నసీమా జిల్లా ఫుట్‌బాల్ సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలవగా.. ఈ నెల 6వ, 7వ తేదీల్లో మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు అలివేణి, 59వ,60వ డివిజన్ల కార్పొరేటర్లు లలితారాణి, నిరంజన్, గ్రామ పెద్దలు సూర్యం, కృష్ణ, శ్రీనివాస్, సతీష్, కృష్ణమూర్తి, జానీమియా తదితరుల పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఉద్యోగులు

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీల నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. బోర్డులు ఏర్పాటు చేసినా 9.11 ఎకరాల భూమికి సరిహద్దులు నిర్ధారించకపోవడంతో ఓ మాజీ ప్రజాప్రతినిధి తోట వేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు కొమ్ము శ్రీను, కొలిచలం స్వామి, గంటా కృష్ణ, గుగ్గిళ్ల అశోక్, పోలేపొంగు రామచంద్రు, వెంకటేశ్వర్లు పోలేపొంగు రాంగోపాల్, కొమ్ము పూలే, మట్టె నాగేశ్వరావు, మట్టె దుర్గాప్రసాద్, నల్లగట్టు శంకర్, వెంకట్‌రెడ్డి, నాగేశ్వరరావు, పల్లెల శరత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నాయకుల ఆందోళనపై రెవెన్యూ అధికారులు స్పందిస్తూ సర్వే నంబర్ 254లో 10.01 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా గ్రామానికి చెందిన కొప్పుల అశోక్‌కు ప్రభుత్వం ఎకరం కేటాయించిందని తెలిపారు. అదికాకుండా మిగిలిన భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ తెలిపారు. అనంతరం ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక జరుపుకునే బతుకమ్మ పండగను పురస్కరించుకుని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు, విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆట, పాటలతో సందడి చేశారు. అనంతరం విద్యార్థులకు బతుకమ్మ పండుగ ప్రాధాన్యతను తెలియజేశారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంరూరల్: స్ప్రింగ్‌లీఫ్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు


రఘునాథపాలెం: పాటివారిగూడెంలో బతుకమ్మ వేడుకలో పాల్గొన్న చిన్నారులు


ఖమ్మం సహకారనగర్: విన్‌ఫీల్డ్ హైస్కూల్‌లో..


ఖమ్మం అర్బన్: వెలుగుమట్ల పాఠశాలలో..


ఖమ్మం సహకారనగర్: స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో..

బతుకమ్మ బుట్టలు సిద్ధం..

నేడు ఎంగిలి పూల బతుకమ్మ ప్రారంభం కానున్నందున వివిధ రకాల సైజుల్లో బతుకమ్మలను పేర్చేందుకు అవసరమైన బుట్టలను తయారు చేస్తున్నారు. నగరంలోని ఇందిరానగర్ కాలనీ మైసమ్మ గుడి వద్ద అల్లుతుండగా.. బతుకమ్మ సైజును బట్టి బుట్ట రూ.200 నుంచి రూ.2000 వరకు అమ్ముతున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


బతుకమ్మ బుట్టలు అల్లుతున్న దృశ్యం